ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09.11.2024 సమయం: 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కుటుంబ సమగ్ర సర్వేపై ప్రజల్లో తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో రెండోదశ సమగ్ర కుటుంబ సర్వే ఈరోజు ప్రారంభమైంది.

2. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందికి గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

3. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి, కిషన్ రెడ్డి ఆరోపించారు.

4. ముఖ్యమంత్రి సహా మంత్రులు రాష్ట్రంలో సమస్యలు గాలికి వదిలేసి, పక్క రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారని బీఆర్ఎస్ పార్టీ విమర్శించింది.

**KULA GANANA-BHATTI**

కుటుంబ సమగ్ర సర్వేపై ప్రజల్లో తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సర్వేకు సంబంధించి జిల్లాల కలెక్టర్లు గణకులతో విస్తృతంగా మాట్లాడాలని, మంత్రులు, శాసన సభ్యులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఉప ముఖ్యమంత్రి ఈ ఉదయం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రశ్నావళీని పకడ్బందీగా రూపొందించారని చెప్తూ, సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. యావత్ దేశం తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కుటుంబ సర్వేను గమనిస్తోందని, ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను కొంసాగించటానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---MSL

**KULA GANANA (AFTER BHATTI)**

కాగా, రాష్ట్రంలో రెండోదశ సమగ్ర కుటుంబ సర్వే ఈరోజు ప్రారంభమైంది. ఇంటి సభ్యుల వివరాలు, వారి సామాజిక-ఆర్థిక స్థితి, ఉపాధి, విద్య, కుల సంబంధిత వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు. జీవనోపాధి రీత్యా రాష్ట్రంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లినవారు ప్రస్తుతం ఎక్కడ ఉంటే అక్కడే తమ వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

DESK

<u>**సర్వే సిద్ధిపేట**</u>

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమన్వయంతో సర్వేను నిర్వహించాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఈరోజు జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

పీటీసీ, సిద్ధిపేట

**PONGULETI**

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఈ ఉదయం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో పర్యటించిన మంత్రి,  ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు, దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సీజన్లో పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా, ప్రతిగింజ కొనుగోలు చేసేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

చేశామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సన్నరకం వడ్లకు ఐదు వందల రూపాయలు బోనస్ గా చెల్లిస్తున్నామని చెప్పారు.
పీటీసీ, ఖమ్మం.

**ధాన్యం- కిషన్ రెడ్డి:**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి, కిషన్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి, రేవన్నపల్లిలో ఈ రోజు కేంద్రమంత్రి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజులైనా ప్రభుత్వం ధాన్యం కొనటం లేదని రైతులు వివరించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ధాన్యం కాంటా వేయకపోవడంతో తక్కువ ధరకు రైతుల నుంచి దళారులు ధాన్యాన్ని కొంటున్నారని, రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు.

----- MSL

**IIT**

విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే దేశం బోలోపేతం అవుతుందని కేంద్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సోమనాథ్ అన్నారు. ఐఐటీ హైదరాబాద్ లో కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తున్న రెండు రోజుల నేషనల్ వెల్ బీయింగ్ కాంక్లేవ్ సదస్సును ఆయన ఈ ఉదయం ప్రారంభించారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడం, సమస్యలను ఎదుర్కోవడం, మానసిక ధృడత్వం వంటి అంశాలను ఈ సదస్సులో చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా సోమ నాథ్ మాట్లాడుతూ... జాతీయ విద్యా విధానం పాలసీ రూపొందించేటప్పుడు... విద్యార్థిపై మానసిక ఒత్తిడి లేకుండా చేయడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

SANGAREDDY. PTC

**SEA PLANE**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ నుంచి శ్రీశైలం వరకు సీ ప్లేన్ సేవలను ఈరోజు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ సీ ప్లేన్ నిర్వహణ చేపడ్తున్నారు. స్పైస్ జెట్ సంస్థ ఈ విమాన సర్వీసులను నడపనున్నది.  ప్రస్తుతం రెండు సీ ప్లేన్లను అందుబాటులో ఉంచారు. ఇందులో ఒకటి 14  సీట్ల కెపాసిటీది కాగా.. మరొకటి 19 సీట్లతో అందుబాటులో ఉంది. శ్రీశైలం నుంచి విజయవాడకు రోడ్డు మార్గంలో 270 కిలోమీటర్ల దూరం ఉండగా.. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో రావాలంటే ఘాట్ రోడ్డు కావడంతో దాదాపు 8 గంటల సమయం పడుతున్నది. ఈ సీ ప్లేన్ ద్వారా కేవలం 45 నిమిషాల్లోనే చేరుకోవచ్చు.

డెస్క్

**HARISH RAO**

ముఖ్యమంత్రి సహా మంత్రులు రాష్ట్రంలో సమస్యలు గాలికి వదిలి పక్క రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు విమర్శించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గ్రామ పంచాయతీలను ప ట్టించుకోవడం లేదని,  మంత్రి ఉత్తమ్ సొంత జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు లేవని, మంత్రి సీతక్క సొంత జిల్లాలో పత్తికి మద్దతు ధర లేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఇదేనా? అని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ప్రశ్నించారు.

డెస్క్

**CM REVANTH REDDY**

కలుషితమైన మూసీ నది పరిసర ప్రాంతాల్లో ప్రకృతి జీవచ్ఛవంగా మారిందని అందుకే మూసీ ప్రక్షాళనకు సంకల్పం తీసుకున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఈ రోజు ట్వీట్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంగెం నుంచి నాగిరెడ్డి పల్లి నిన్న ఆయన మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. మూసీ పునరుజ్జీవ సంకల్పంలో భాగంగా 2025 జనవరి మొదటి వారంలో మూసీ కృష్ణా నదిలో కలిసే వాడపల్లి నుంచి చార్మినార్ వరకు పాదయాత్ర చేస్తానని ఆయన ప్రకటించారు.

డెస్క్

**శనగ విత్తనాలు**

యాసంగి సీజన్ కోసం రైతులకు క్వింటాలుకు 300 రూపాయిల రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈరోజు నుంచి ఈ రాయితీతో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం క్వింటాలు శనగ విత్తనాల ధర 9 వేల రూపాయిలు ఉండగా.. రాయితీ పోను 8,700కు విక్రయిస్తారు.

DESK

**మల్లు రవి**

తెలంగాణ –ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించేలా నాగర్ కర్నూల్-మాచర్ల రైల్వే పనులు ప్రారంభించాలని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ ను కోరారు. డోర్నకల్ నుంచి సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల్ వరకు నూతన రైల్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే సర్వే పూర్తయిన జడ్చర్ల-నాగర్ కర్నూల్-కొల్లాపూర్, నంద్యాల వరకు కూడా రైల్వే పనులు ప్రారంభించాలని ఎంపీ ప్రారంభించాలని లేఖ ఇచ్చారు.

డెస్క్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి.రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్-1 స్టెనో, టైపిస్ట్-1, రికార్డ్ అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఈ నెల 22వ తేదీలోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానం-కుమ్రంభీం ఆసిఫాబాద్ కు చేరే విధంగా రిజిస్టర్డ్ పోస్ట్, కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలని సూచించారు.

పిటీసీ, ఆసీఫాబాద్

**SSC FEE**

వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు ఈనెల 18వ తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది. పరీక్ష ఫీజు 125 రూపాయలుగా నిర్ణయించారు. SC, ST, BC వర్గాలకు చెందిన విద్యార్థులు తమ కుటుంబ ఆదాయం పట్టణాల్లో 24 వేల రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 వేల రూపాయల లోపు ఉండి దానికి సంబంధించిన ధ్రువపత్రం సమర్పిస్తే పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

DESK

**వరంగల్ టెక్నికల్ ఫెస్ట్**

వరంగల్ లోని ఎన్ఐటిలో ఏటా నిర్వహించే  టెక్నికల్ ఫెస్ట్ టెక్నోజియాన్ 2024 కార్యక్రమం నిన్న సాయంత్రం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో...ఈ రోజు ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, డేటా సైన్స్ కాంటెస్ట్, సర్క్యూట్ చేంజ్, కెమికల్ ఎక్స్పో ఎగ్జిబిషన్, డ్రోన్ వెలోసిటీ స్టేడియం, రీసెర్చ్ పేపర్ ప్రెజెంటేషన్, మెటా ఫోర్జ్, కెమికల్ రిలే రేస్, మెటా ల్యాబ్ వర్క్ షాప్, క్యాంపస్ ఇన్నోవ్ 8, ఐడియాథాన్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు.

పీటీసీ, వరంగల్

**వనపర్తి ఓటర్**

2025 జనవరి 1వతేది వరకు 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత తప్పక తమ పేర్లను ఓటరు జాబితా లో ఓటరుగా నమోదు చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. స్వీప్2025 కార్యక్రమం లోభాగంగా వనపర్తి జిల్లాలో పోల్లింగ్ బూత్ కేంద్రాలలో ఈరోజు, రేపు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

పీటీసీ, వనపర్తి